సాక్షి
రాజన్న సిరిసిల్ల

మంగళవారం। 20। మే। 2025



పుచ్చలపల్లికి నివాళి

సిరిసిల్లటౌన్: పుచ్చలపల్లి సుందరయ్య 40వ వర్ధంతి సందర్భంగా సోమవారం వెంగళ శ్రీనివాస్ ఆధ్వర్యంలో కార్మికులు, నాయకులు నివాళి అర్పించారు.



మంచినీళ్లు మహాప్రభో

గంభీరావుపేట(సిరిసిల్ల): నర్మాలలో నీటి సమస్య పరిష్కరించాలని కోరుతూ మహిళలు సోమవారం ఖాళీ బిందెలతో నిరసన తెలిపారు. 6, 7, 8 వార్డులలో సమస్య తీవ్రంగా ఉందన్నారు.

గరిష్టం/కనిష్టం
37.0/26.0

వాతావరణం

ఆకాశం మేఘావృతమవుతుంది. జిల్లాలో స్వల్పంగా వర్షం కురిసే అవకాశం ఉంది. గాలిలో తేమ అధికంగా ఉంటుంది.

న్యూస్‌రీల్

సమస్యల పరిష్కారమే లక్ష్యం

- ఎస్పీ మహేశ్ బీ గీతే



సిరిసిల్లక్రైం: ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించి వాటి పరిష్కారమే లక్ష్యంగా ప్రతీ సోమవారం గ్రీవెన్స్ డే నిర్వహిస్తున్నట్లు ఎస్పీ మహేశ్ బీ గీతే తెలిపారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన అర్జీదారుల నుంచి 33 ఫిర్యాదులు స్వీకరించి, ఆయా పోలీస్‌స్టేషన్ల అధికారులకు ఫోన్‌చేసి త్వరగా పరిష్కరించాలని ఆదేశించారు. అవసరమైతే క్షేత్రస్థాయిలో పరిశీలించి నిజానిజాలు తెలుసుకోవాలని సూచించారు.

నేడు వేములవాడ-ముంబయి ఏసీ బస్సు ప్రారంభం

వేములవాడ: వేములవాడ నుంచి ముంబయికి వెళ్లేందుకు ఏసీ స్లీపర్ కోచ్ బస్సును రాష్ట్ర బీసీ, రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ మంగళవారం ప్రారంభించనున్నట్లు ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ సోమవారం తెలిపారు. వేములవాడ నుంచి కోరుట్ల, మెట్‌పల్లి, ఆర్మూర్, నిజామాబాద్, పుణె మీదుగా ముంబయి చేరుకుంటుందని తెలిపారు. సిట్టింగ్ రూ.1,500, స్లీపర్ రూ.2వేలు చార్జీలు ఉన్నట్లు చెప్పారు. అనంతరం స్థానిక మహాలింగేశ్వర ఫంక్షన్‌హాల్‌లో నియోజకవర్గ స్థాయి సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

కాంగ్రెస్‌ను బలోపేతం చేయడమే లక్ష్యం



ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయాలనే లక్ష్యంతో గ్రామ, మండల శాఖ నూతన కార్యవర్గాలను ఎన్నుకుంటున్నట్లు పీసీసీ పరిశీలకులు ఫక్రుద్దీన్, చైతన్య కృష్ణారెడ్డి పేర్కొన్నారు. ఎల్లారెడ్డిపేటలోని పార్టీ కార్యాలయంలో సోమవారం కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. ఏళ్లుగా పార్టీ కోసం కష్టపడి పనిచేస్తున్న కార్యకర్తలను గుర్తిస్తామన్నారు. బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య, పార్టీ మండలాధ్యక్షుడు సద్ది లక్ష్మారెడ్డి, ఏఎంసీ చైర్‌పర్సన్ సాబేరా బేగం, వైస్‌చైర్మన్ గుండాడి రాంరెడ్డి, జిల్లా మైనార్టీ సెల్ అధ్యక్షుడు సాహెబ్ పాల్గొన్నారు.

నేడు ఐఐహెచ్‌టీ కోర్సుపై అవగాహన సదస్సు

సిరిసిల్ల: కొండా లక్ష్మణ్ బాపూజీ ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ హ్యాండ్లూమ్ టెక్నాలజీ(ఐఐహెచ్‌టీ) కోర్సుపై అవగాహన కల్పించేందుకు మంగళవారం సిరిసిల్లలో సదస్సు నిర్వహిస్తున్నామని చేనేత, జౌళిశాఖ సహాయ సంచాలకులు రాఘవరావు తెలిపారు. 2025–2026 విద్యాసంవత్సరంలో 60 సీట్లు చేనేత, టెక్స్‌టైల్స్ టెక్నాలజీ డిప్లొమా కోర్సులో ఉన్నట్లు వివరించారు. ఆ కోర్సు ప్రాధాన్యతను వివరించేందుకు బీవై నగర్‌లోని పాత ఏడీ ఆఫీస్‌లో మంగళవారం ఉదయం 11 గంటలకు అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

భగవద్గీత పఠనంలో గోల్డ్‌మెడల్స్



ముస్తాబాద్(సిరిసిల్ల): భగవద్గీతలోని 700 శ్లోకాలను కంఠస్థం చేసిన ఇద్దరు అక్కాచెల్లెళ్లు గోల్డ్‌మెడల్స్ సాధించారు. ముస్తాబాద్ మండలం ఆవునూర్‌కు చెందిన కటకం లక్ష్మి, కటకం విజయలక్ష్మి మైసూర్‌లో జరిగిన భగవద్గీత శ్లోకాల పోటీల్లో సత్తా చాటారు. 700 శ్లోకాలను అలవోకగా ఆలపించిన అక్కాచెల్లెళ్లకు గణపతి సచ్చిదానంద స్వామి చేతుల మీదుగా బంగారు పతకాలను అందించారు.

కంచర్ల పంచాయతీ కార్యదర్శి సస్పెన్షన్

వీర్నపల్లి(సిరిసిల్ల): విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించిన కంచర్ల పంచాయతీ కార్యదర్శి ముక్తార్ అహ్మద్‌ను కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా సోమవారం సస్పెండ్ చేశారు. గ్రామంలో డెంగీ కేసులు నమోదైనప్పటికీ పారిశుధ్య చర్యలు చేపట్టకపోవడంతో కలెక్టర్ తీవ్రంగా పరిగణించారు. సోమవారం గ్రామంలో పర్యటించిన కలెక్టర్.. పంచాయతీ కార్యదర్శి లేకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యదర్శి అందుబాటులో లేకపోవడంతో సస్పెండ్ చేశారు.

జ్వరం..ఒళ్లునొప్పులు



- ఈమె వీర్నపల్లి మండలం కంచర్లకు చెందిన దండుగుల లక్ష్మి. నాలుగు రోజుల క్రితం చాతి, తలనొప్పి తో పాటు పక్కబొక్కలు నొప్పి లేశాయి. విపరీతమైన జ్వరం వచ్చింది. ఊరిలోకి వైద్యశాఖ నుంచి వచ్చినోళ్లు గోలీలు ఇచ్చినా తగ్గలేదు. ఇంట్లో వాళ్లు వెంటనే సిరిసిల్లలోని జిల్లా ఆస్పత్రికి తీసుకొచ్చి పరీక్షలు చేశారు. ర్యాపిడ్ టెస్టులో డెంగీ పాజిటివ్ వచ్చింది. ఇన్‌పేషెంటుగా చేర్చుకుని చికిత్స అందిస్తున్నారు.



- ఈమె వీర్నపల్లి మండల కేంద్రానికి చెందిన శశికళ. ఈనెల 16న తీవ్ర జ్వరం, వాంతులు, ఒళ్లు నొప్పులతో సిరిసిల్ల జిల్లా ఆస్పత్రికి వచ్చింది. ర్యాపిడ్ టెస్టు చేయగా డెంగీ పాజిటివ్‌గా తేలింది. వైద్యులు వెంటనే ట్రీట్‌మెంట్ ప్రారంభించారు. ప్లేట్‌లెట్స్ సంఖ్య పడిపోకుండా 24 గంటలు సిబ్బంది పర్యవేక్షణలో చికిత్స అందుతోంది.



జిల్లా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రోగులు

- వణికిస్తున్న వైరల్, డెంగీ కేసులు
- జిల్లా ఆస్పత్రికి పోటెత్తుతున్న రోగులు
- నిత్యం 700 మందికి పైగా ఔట్‌పేషంట్లు
- ప్లేట్‌లెట్స్ తగ్గడంతో జనాలు బెంబేలు

సిరిసిల్లటౌన్: జిల్లాలో విషజ్వరాలు విజృంభిస్తున్నాయి. పల్లె..పట్నం తేడా లేకుండా జనాలు మంచం పడుతున్నారు. మండుటెండలు ఒక వైపు.. కురుస్తున్న వర్షాలు మరో వైపుతో వాతావరణంలో తీవ్రమార్పులు చోటుచేసుకున్నాయి. ఫలితంగా దోమలు పెరిగి జ్వరాలు వస్తున్నాయి. నీరు, ఆహారం కలుషితమై విరోచనాలు, మలేరియా, డెంగీ వ్యాధులు వస్తున్నాయి. జ్వర బాధితులతో జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రులు కిటకిటలాడుతున్నాయి. జిల్లా ఆస్పత్రికే నిత్యం 700 వరకు రోగులు ఓపీ సేవలు పొందుతున్నారు. వీర్నపల్లి, ఎల్లారెడ్డిపేట మండలాల్లో డెంగీ కేసులు బయటపడుతుండడం జనాలను భయాందోళనకు గురిచేస్తున్నాయి.

లక్షణాలు..చికిత్స

సాధారణం నుంచి తీవ్రమైన జ్వరం, తలనొప్పి, ఒంటినొప్పులు, వాంతులు, విరోచనాలు, కండ్లు లాగడం వంటి లక్షణాలతో జ్వరాలు వ్యాపిస్తున్నాయి. మూత్రంలో రక్తం రావడం, నాలుక నల్లబారడం, జ్వరం తగ్గకపోవడం వంటి లక్షణాలు కనిపిస్తుంటాయి. ఇలాంటి సమయంలో వెంటనే ఆస్పత్రిలో వైద్యుడిని సంప్రదించడం ఉత్తమం. ఎన్‌ఎస్‌ఐ ఏజీ టెస్టు పాజిటివ్ వస్తే డెంగీ మొదటి దశలో ఉందని అర్థం. ఈ దశలో రెండు, మూడు రోజులు ఉంటుంది. ఐజీహెచ్ టెస్టు పాజిటివ్ వస్తే మోడరేట్ టు సివియర్‌గా పరిగణించి చికిత్స అందిస్తారు. ఈసమయంలో జాగ్రత్తలు తీసుకోవాల్సి ఉంటుంది. అన్ని రకాల జ్వరాలకు అన్ని ప్రభుత్వ ఆస్పత్రుల్లో చికిత్స అందుబాటులో ఉంది. ప్రైవేటుకు వెళ్లాల్సిన అవసరం లేదు. జ్వరాల తీవ్రత పెరిగితే జిల్లా ఆస్పత్రిలో కార్పొరేట్ వైద్యానికి దీటుగా మూడు షిఫ్టుల్లో 24 గంటలపాటు సిబ్బంది వైద్యసేవలు అందిస్తున్నారు. జిల్లాలో జ్వరాల తీవ్రత దృష్ట్యా కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా వైద్యశాఖను అప్రమత్తం చేశారు.

డెంగీ నుంచి కోలుకుంటున్న



ఎనిమిది రోజుల క్రితం తలనొప్పి, కండ్లు గుంజుడం.. నడుం నొప్పి వచ్చింది. జ్వరం ఎక్కువైంది. జిల్లా ఆస్పత్రికి వచ్చినం. ఇక్కడ ఎలీసా టెస్టు చేస్తే పాజిటివ్ రావడంతో వైద్యం అందించారు.ఎలాంటి ఖర్చు లేకుండానే డెంగీ జ్వరం నుంచి కోలుకుంటున్న.

– మిర్యాల మంజుల, కంచర్ల

మెరుగైన చికిత్స అందిస్తున్నాం



ఇటీవల రెండు డెంగీ పాజిటివ్ కేసులు వచ్చాయి. ఇతర విషజ్వరాలతో కూడా రోగులు వస్తున్నారు. ఆస్పత్రిలో అన్ని రకాల మందులు ఉన్నాయి. ఫ్లూయిడ్స్, ఇంజక్షన్లు, ఓఆర్‌ఎస్‌లు, యాంటిబయాటిక్స్ ఉన్నాయి. వెంటిలేటర్, ఆక్సిజన్ సౌకర్యం ఉంది. ఐసీయూలో పది పడకలు కేటాయించాం. జిల్లా ఆస్పత్రిలో అన్ని విభాగాల వైద్యులతో చికిత్స అందిస్తున్నాం. ప్రైవేటు కన్నా మెరుగ్గా వైద్యం అందిస్తున్నాం.

– డాక్టర్ లక్ష్మీనారాయణ, సూపరింటెండెంట్ జిల్లా ఆస్పత్రి, సిరిసిల్ల

రాజన్నపేట ఇళ్ల పరిహారంపై నేడు విచారణ

- బై నంబర్లతో రూ.1.80 కోట్లు చెల్లింపులపై ఫిర్యాదులు



రాజన్నపేట

బోయినపల్లి(చొప్పదండి): మిడ్‌మానేరులో ముంపునకు గురైన బోయినపల్లి మండలం వరదవెల్లి అనుబంధ గ్రామం రాజన్నపేటలోని 9 ఇళ్ల పరిహారం చెల్లింపులపై కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా విచారణకు ఆదేశించారు. ఈమేరకు డీఎల్‌పీవో నరేశ్ మంగళవారం వరదవెల్లి గ్రామ పంచాయతీ కార్యాలయంలో విచారణ చేపట్టనున్నారు. పరిహారం పొందిన 9 పాత ఇళ్ల ఇంటి నంబర్లకు బై నంబర్లతో దాదాపు రూ.1.80 కోట్ల మేర పరిహారం పొందేందుకు ప్రయత్నిస్తున్నారని గతంలో ఆరోపణలు వచ్చాయి. పరిహారం చెల్లింపులు నిలిచిపోయాయి.

ఫిర్యాదులతో నిలిచిన చెల్లింపులు

వరదవెల్లి ఆర్‌అండ్‌ఆర్ కాలనీలో సుమారు 482 వరకు ఇంటి నంబర్లు ఉన్నాయి. 2006 నుంచి ఇళ్లు, భూముల ముంపు గుర్తింపు జరిగింది. 2014లో ఎంఎంఆర్ నంబర్లు వేసి నోటీసులు ఇచ్చారు. మళ్లీ నిర్మాణాలు చేస్తే పరిహారం వర్తించదని స్పష్టం చేశారు. కాగా తప్పిపోయిన ఇళ్లకు పరిహారం ఇవ్వాలని 2021లో గత ప్రభుత్వం జీవో ఇచ్చినట్లు అధికారులు తెలిపారు. దీంతో 9 ఇళ్లకు సంబంధించిన వారు పరిహారం కావాలని జిల్లా అధికారులకు వినతిపత్రాలు ఇచ్చారు. ఈక్రమంలో కలెక్టరేట్ నుంచి ఎస్డీసీ అకౌంట్‌లోకి డబ్బులు జమ చేశారు. రూ.1.80 కోట్ల మేర పరిహారం చెల్లించేందుకు అధికారులు చెక్కులు సిద్ధం చేశారు. పరిహారం పొందిన ఇళ్లకు బై నంబర్లతో మళ్లీ పరిహారం పొందుతున్నారని ఫిర్యాదులు వెళ్లడంతో చెల్లింపులు నిలిచిపోయాయి. మంగళవారం నాటి విచారణకు గ్రామంలో 2015 నుంచి 2019 వకు వరదవెల్లి గ్రామపంచాయతీ కార్యదర్శులుగా పనిచేసిన వారు హాజరు కావాలని కలెక్టర్ ఆదేశించారు. విచారణ నేపథ్యంలో కొందరి అధికారుల్లో భయం నెలకొన్నట్లు సమాచారం.

రేపు సహకార సంఘం బకాయిలపై చర్చ

- సిరిసిల్లలో సమావేశం
- రెండు పర్యాయాలు పాలకవర్గ సభ్యులకు నోటీసులు

చందుర్తి(వేములవాడ): చందుర్తి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో 12 ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న బకాయిలపై చర్చించేందుకు ఈనెల 21న సిరిసిల్లలోని సహకార సంఘం కార్యాలయంలో సమావేశం ఏర్పాటు చేశారు. ఈమేరకు స్థానిక పాలకవర్గ సభ్యులకు రెండు పర్యాయాలు జిల్లా సహకార అధికారులు నోటీసులు జారీ చేశారు. చందుర్తి సింగిల్‌విండోలో అవినీతి, అక్రమాలపై ఆరు నెలలుగా 51 విచారణ కొనసాగింది. ఈ విచారణలో రూ.1,03,85,884 సీఈవో తన సొంతానికి వాడుకున్నాడని తేలింది. వ్యక్తిగత రుణాల కింద రూ.32,58,894, దీర్ఘకాలిక రుణాల సొమ్ము రూ.32,30,190 ఏళ్లుగా వసూలు చేయలేదని విచారణలో వెల్లడైంది. సంఘం పరిధిలో బకాయిపడ్డ రూ.1,68,74,968 సంఘంలో జమచేసే విషయమై 2013లో అప్పటి సింగిల్‌విండో పాలకవర్గం సభ్యులతోపాటు ప్రస్తుత పాలకవర్గ సభ్యులకు నోటీసులు అందజేశారు. 12 ఏళ్ల నుంచి సంఘంలో జరుగుతున్న అవినీతి, అక్రమాలన్నీ 51 విచారణతో తేటతెల్లమయ్యాయి. దీనిపై 21న సరిగే సమావేశంతో సంఘం బకాయిల వసూలుపై సహకార సంఘం అధికారులు నిర్ణయం తీసుకోనున్నట్లు తెలిసింది.

ఇద్దరు డీఎస్పీల బదిలీ

సిరిసిల్లక్రైం: జిల్లాలో పనిచేస్తున్న ఇద్దరు డీఎస్పీలను బదిలీ చేస్తూ రాష్ట్ర పోలీస్‌శాఖ సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. సిరిసిల్ల ఎస్పీ డీఎస్పీ మురళీకృష్ణను హైదరాబాద్‌లోని పంజాగుట్ట డీఎస్పీగా బదిలీ చేశారు. డీసీఆర్బీ డీఎస్పీగా పనిచేస్తున్న సీహెచ్ శ్రీనివాస్‌ను ట్రాఫిక్ రామగుండం ఏసీపీగా బదిలీ చేశారు. జిల్లాకు ఎవరిని కేటాయించలేదు.

ఆరోగ్య సిబ్బంది ఇంటింటికి వెళ్లాలి

- డెంగీ ప్రబలకుండా చర్యలు తీసుకోవాలి
- ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలకు ఏర్పాట్లు
- మహిళా సంఘాలకు ఎరువులు, విత్తనాల దుకాణాలు
- కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా



కలెక్టరేట్‌లో అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా

సిరిసిల్ల: జిల్లాలో ఆరోగ్య సిబ్బంది ఇంటింటికెళ్లాలని, డెంగీ ప్రబలకుండా ముందుజాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం అధికారులతో సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ వచ్చే వానాకాలంలో డెంగీ రాకుండా ముందుజాగ్రత్త చర్యలకు సన్నద్ధం కావాలన్నారు. నీరు నిల్వ ఉండే ప్రాంతాలను గుర్తించి, నియంత్రణకు చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రతీ మంగళ, శుక్రవారాలలో డ్రైడే నిర్వహించాలన్నారు. డీఎంహెచ్‌వో రజిత, మున్సిపల్ కమిషనర్లు అన్వేశ్, వాణి పాల్గొన్నారు.

ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలకు పకడ్బందీగా ఏర్పాట్లు

జిల్లాలో ఇంటర్మీడియెట్ అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఆదేశించారు. ఈనెల 22 నుంచి 29 ఇంటర్ పరీక్షలు, జూన్ 3 నుంచి 12 వరకు ప్రాక్టికల్ పరీక్షలు నిర్వహిస్తామన్నారు. జిల్లాలో 13 సెంటర్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేయాలని, జిరాక్స్ సెంటర్లు మూసివేయాలన్నారు. అదనపు ఎస్పీ చంద్రయ్య, ఆర్డీవోలు రాధాబాయి, వెంకటేశ్వరావు, జిల్లా ఇంటర్మీడియెట్ నోడల్ అధికారి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మహిళా సంఘాలకు ఎరువుల దుకాణం

జిల్లాలోని ఐదు మహిళా సంఘాలకు ఎరువుల దుకాణాలకు ఈ–పాస్ మిషన్లను కలెక్టర్ పంపిణీ చేశారు. మహాలక్ష్మీ గ్రామైక్య సంఘం ఫెర్టిలైజర్స్ అండ్ విత్తనాలు(పెద్దూర్), శ్రీధనలక్ష్మీ మండల సమాఖ్య ఫెర్టిలైజర్స్ అండ్ విత్తనాలు వేములవాడ, శివరామ్ గ్రామైక్య సంఘం ఫెర్టిలైజర్స్ అండ్ విత్తనాలు వేములవాడ మండలం బొల్లారం, విలాసాగర్ గ్రామైక్య సంఘం ఫెర్టిలైజర్స్ అండ్ విత్తనాలు బోయినపల్లి, వెన్నెల గ్రామ సమాఖ్య సంఘం రుద్రంగి వారికి ఈ–పాస్ యంత్రాలు అందజేశారు. జెడ్పీ సీఈవో వినోద్‌కుమార్, జిల్లా వ్యవసాయాధికారి అఫ్జల్ బేగం తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య పనులు పకడ్బందీగా చేపట్టాలి

వీర్నపల్లి(సిరిసిల్ల): గ్రామంలో పారిశుధ్య పనులు పకడ్బందీగా చేపట్టాలని కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా ఆదేశించారు. వీర్నపల్లి మండలం కంచర్ల గ్రామంలో విషజ్వరాలు ప్రబలుతుండడంతో సోమవారం గ్రామాన్ని సందర్శించారు. జ్వరబాధితుల ఇళ్లకు వెళ్లి వివరాలు తెలుసుకున్నారు. కలెక్టర్ మాట్లాడుతూ ఇంటి పరిసరాల్లో నీరు నిలువ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. జిల్లా వైద్యాధికారి రజిత, ఇన్‌చార్జి ఎంపీడీవో అబ్దుల్ వాజిద్ తదితరులు పాల్గొన్నారు.

రైతు ముంగిట్లో వ్యవసాయ శాస్త్రవేత్తలు



అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్తలు

తంగళ్లపల్లి(సిరిసిల్ల): ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం, బాబు జగ్జీవన్‌రామ్ వ్యవసాయ కళాశాల జిల్లెల్ల ఆధ్వర్యంలో చీర్లవంచలో సోమవారం రైతు ముంగిట్లో వ్యవసాయ శాస్త్రవేత్తలు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ శాస్త్రవేత్తలు మాట్లాడుతూ రైతులు పంటలకు సిఫారసు చేసిన మోతాదులోనే యూరియాను వినియోగించాలన్నారు. పచ్చిరొట్ట ఎరువులు, వర్మీకంపోస్టు, పేడ ఎరువులను వినియోగించాలన్నారు. చీడపీడల ఉధృతిని బట్టి సరైన మోతాదులో రసాయనిక మందుల వాడడంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో బాబు జగ్జీవన్‌రామ్ వ్యవసాయ కళాశాల వ్యవసాయ శాస్త్రవేత్తలు డా.రజియా సుల్తానా, కె.భవ్యశ్రీ, జిల్లా వ్యవసాయ అధికారి అఫ్జల్ బేగం, మండల వ్యవసాయ అధికారి కె.సంజీవ్, ఏఈవో కరుణాకర్, మౌనిక, విత్తన అధికారి మౌనిక, విద్యార్థులు మణికంఠ, శాలిని, రైతులు పాల్గొన్నారు.

విన్నపాలు వినవలే..

- ప్రజావాణిలో వెల్లువెత్తిన వినతులు
- అర్జీలు స్వీకరించిన కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా
- వివిధ సమస్యలపై 120 విన్నపాలు



ప్రజావాణిలో బాధితుల సమస్యలు వింటున్న కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా

సిరిసిల్లటౌన్: తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ పలువురు బాధితులు కలెక్టరేట్ బాట పడుతున్నారు. క్షేత్రస్థాయిలో సమస్యలు పరిష్కారం కాక కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణికి భారీ సంఖ్యలో బాధితులు తరలివచ్చారు. కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా వినతిపత్రాలు స్వీకరించి పరిష్కరించాల్సిందిగా ఆయా శాఖల అధికారులను ఆదేశించారు. అర్జీల పరిష్కారంలో జాప్యం చేయొద్దని అధికారులను ఆదేశించారు. రెవెన్యూ 54, మున్సిపల్ 11, డీఆర్‌డీవో 7, ఉపాధికల్పన 6, హౌసింగ్ 5, ఎస్‌డీసీ 4, డీడబ్ల్యూవో 3, ఎస్సీ కార్పొరేషన్, ఏడీఎస్ అండ్ ఆర్‌డీఎస్‌వో, హ్యాండ్లూమ్, టెక్స్‌టైల్, డీఎంహెచ్‌వోకు రెండు చొప్పున మొత్తంగా 120 అర్జీలు వచ్చినట్లు అధికారులు తెలిపారు. సిరిసిల్ల ఆర్డీవో వెంకటేశ్వర్లు, వేములవాడ ఇన్‌చార్జి ఆర్డీవో రాధాబాయి, జెడ్పీ సీఈవో వినోద్‌కుమార్, వ్యవసాయాధికారి అఫ్జల్‌బేగం తదితరులు పాల్గొన్నారు.

అక్రమంగా పట్టా చేసుకుండ్రు



ఊరిలో మా మామ పేరిట 9 ఎకరాల స్థలం ఉంది. ఆయనకు ఇద్దరు కొడుకులు, ముగ్గురు కూతుళ్లు. వారిలో చిన్నకూతురు మినహా ఎవరూ బతికిలేరు. వారసత్వంగా మాకు సంక్రమించాల్సిన భూమిని కొందరు నా ప్రమేయం లేకుండానే వారి పేరిట పట్టా చేయించుకున్నారు. నా పోషణ గురించి పట్టించుకోవడం లేదు. నాకు న్యాయం చేయాలి.

– జూలూరి మల్లవ్వ, సముద్రలింగాపూర్

ప్రైవేటు ఆస్పత్రులపై చర్యలు తీసుకోవాలి



జిల్లాలోని చాలా ప్రైవేటు ఆస్పత్రులు నిబంధనలు పాటించడం లేదు. వైద్యుల అర్హతల వివరాలు ప్రదర్శించడం లేదు. ధనార్జనే ధ్యేయంగా ఆస్పత్రులు నిర్వహిస్తున్నారు. డబ్బుల కోసం రోగుల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్న ఆస్పత్రులపై కఠిన చర్యలు తీసుకోవాలి.

– అంగూరి రంజిత్, సిరిసిల్ల

నా స్థలాన్ని కబ్జా కానీయొద్దు



మాకు జిల్లాకేంద్రం విద్యానగర్ బైపాస్ రోడ్డులో సర్వేనంబర్ 517లో స్థలం ఉంది. నేను ఉపాధి నిమిత్తం మా స్థలంలో హోటల్ పెట్టుకోవాలని చూస్తుంటే ఓ బీఆర్‌ఎస్ నాయకుడు బెదిరిస్తున్నాడు. అదే సర్వేనంబర్‌లో వారికి ఉన్న భూమి బైపాస్‌రోడ్డులో పోయింది. అప్పుడు పరిహారం కూడా పొందారు. ఇప్పుడు నిరుపేద అయిన నా స్థలాన్ని కాజేయాలని చూస్తుండ్రు. కలెక్టర్ న్యాయం చేయాలి.

– షేక్ జలీల్, విద్యానగర్

వారసత్వ పనిని ఇప్పించాలి



మాది తిప్పాపురం. వేములవాడ బద్దిపోచమ్మ ఆలయంలో 60 ఏళ్లుగా మా వంశానికి చెందిన వారు 8 పాళ్లుగా పట్నాలు వేస్తున్నాం. అయితే మూడేళ్లుగా మా కులస్తులు ఎనిమిది పాళ్లు కాదని కొడుకులున్నోళ్లు మొత్తంగా 26 పాళ్లు చేశారు. నా కొడుకు అనారోగ్యంతో ఉంటున్నాడు. నాకు పాలు కల్పించాలని కోరితే వారు ఒప్పుకోవడం లేదు. ఈ విషయమై వేములవాడ ఆలయ ఈవో సైతం వారికి చెప్పారు. అయినా వినడం లేదు.

– పి.అంజలి, వేములవాడ

ఉపాధి కల్పించాలి



మాది రగుడు గ్రామం. నిరుపేద దళిత కుటుంబానికి చెందిన దివ్యాంగుడిని. మా నాన్న చాలా ఏళ్ల క్రితమే చనిపోయాడు. అమ్మే నన్ను ఐటీఐ వరకు చదివించింది. ప్రస్తుతం లైసెన్స్‌డ్ సర్వేయర్‌కు దరఖాస్తు తీసుకున్నారు. నాకు లైసెన్స్‌డ్ సర్వేయర్‌గా ఉద్యోగం కల్పించి ఆదుకోవాలి.

– బూర మధు, రగుడు

చెరువుకట్టలు పునర్ నిర్మించాలి



గ్రామ శివారులోని పెద్దచెరువు, కొత్తచెరువులో పూడిక తీయాలి. పూడిక తీయగా చెరువు లోతు పెరుగుతుంది. పూడిక తీయకపోవడంతో చిన్నవర్షాలకే నిండి మత్తడి దూకుతున్నాయి. వెంటనే వాటిలో పూడిక తీసి కట్టలను పునర్ నిర్మించాలి. ఫలితంగా చెరువులోంచి నీరు వృథాపోకుండా అరికట్టవచ్చు.

– రవీందర్, చిన్నబోనాల

లే అవుట్ స్థలం మాయం చేశారు



సిరిసిల్ల మున్సిపల్ పరిధిలోని లే అవుట్ స్థలాన్ని గత ప్రభుత్వ హయాంలో పెద్దల అనుయాయులు మాయం చేశారు. సర్వే నంబరు 525, 530/సీలో ఫైల్ నంబరు 1828/80లో 121 గజాల స్థలం ప్లాట్ నంబరు 13ను మున్సిపల్‌కు చెందిందిగా పేర్కొన్నారు. దాని విలువ రూ.40లక్షలు ఉంటుంది. కబ్జాకు గురైన మున్సిపల్ లే అవుట్ స్థలాన్ని గుర్తించి మున్సిపల్‌కు అప్పగించేలా చర్యలు తీసుకోవాలి.

– నాగుల శ్రీనివాస్, సిరిసిల్ల

ధాన్యం తరుగు అరికట్టాలి



మా గ్రామంలో ధాన్యం కొనుగోళ్లలో తరుగు తీస్తున్నారు. ఎందుకు తీయాల్సి వస్తుందో కూడా వివరణ ఇవ్వడం లేదు. నాతోపాటు గ్రామానికి చెందిన రైతులు ఓన్నులాల్, సజన్‌లాల్‌కు చెందిన 710 బస్తాలను లారీలో మిల్లుకు తరలించగా వాటిలోంచి 21 బస్తాలు తరుగు తీసినట్లు చెబుతున్నారు. ధాన్యం కొనుగోళ్లలో తరుగుపై విచారణ చేపట్టి బాధ్యులపై చర్యలు తీసుకోవాలి.

– భూక్య గజన్‌లాల్, వీర్నపల్లి

క్లుప్తంగా

మామిడికాయ పచ్చడి విషయంలో గొడవ

● భార్యను గొంతు నులిమి చంపిన భర్త


అంజలి(ఫైల్)

కాల్వశ్రీరాంపూర్(పెద్దపల్లి): మామిడికాయ పచ్చడి పెట్టే విషయంలో తలెత్తిన గొడవలో భార్యను గొంతు నులిపి చంపాడు భర్త. ఈ ఘటన పందిళ్ల గ్రామంలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం .. గ్రామానికి చెందిన సూర అంజలి– సూర రాజ్‌కుమార్ దంపతులు. వీరికి ఇద్దరు కుమారులు ఉన్నారు. ఆదివారం సాయంత్రం మామిడికాయ పచ్చడి పెట్టేందుకు అంజలి సన్నద్ధమైంది. ఇందుకోసం అవసరమైన వెల్లుల్లి కొనుక్కు రావాలని భర్త రాజ్‌కుమార్‌కు సూచించింది. ఈ విషయంలో దంపతుల మధ్య గొడవ జరిగింది. కోపోద్రిక్తుడైన రాజ్‌కుమార్.. అంజలి(27)ను గొంతు నులిమి చంపేశాడు. ఈమేరకు మృతురాలి తండ్రి సంపంగి మల్లేశ్ సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు శవాన్ని పరిశీలించి పోస్టుమార్టం కోసం ఆస్పత్రికి తరలించారు. మృతురాలి భర్త రాజ్‌కుమార్‌పై కేసు నమోదు చేశామని ఎస్సై వెంకటేశ్ తెలిపారు.

ఉరివేసుకుని వృద్ధుడి ఆత్మహత్య


లింగయ్య(ఫైల్)

రామగిరి(మంథని): కల్వచర్ల గ్రామానికి చెందిన వేముల లింగయ్య(90) ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్సై చంద్రకుమార్, కుటుంబ సభ్యుల కథనం ప్రకారం .. లింగయ్య భార్య పద్మ కొంతకాలం క్రితం మరణించడంతో లింగయ్య ఒంటరితనం, అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నాడు. ఆదివారం రాత్రి తన ఐదో కుమారుడు ఇంట్లో భోజనం చేయాలని అడుగగా తినకుండా వెళ్లి పడుకున్నాడు. సోమవారం ఉదయం బయటకు రాకపోవడంతో కుటుంబ సభ్యులు వెళ్లి తలుపుతీయగా రేకులషెడ్డు కర్రకు ఉరి వేసుకుని ఉన్నాడు. తమ తండ్రి ఒంటరిగా ఉండటంతో మనస్తాపానికి గురై ఆత్మహత్య చేసుకున్నాడని మృతుడి పెద్ద కుమారుడు వేముల కుమార్‌స్వామి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు.

భర్తను చితకబాదిన భార్య


ఎల్లారెడ్డిపేటలో భర్తపై దాడి చేస్తున్న భార్య

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): బిడ్డను తీసుకెళ్తున్నాడని ఆగ్రహించిన భార్య.. భర్తపై దాడి చేసింది. స్థానికులు తెలిపిన వివరాలు. ఎల్లారెడ్డిపేట మండలం రాజన్నపేట పరిధిలోని కిష్టు నాయక్‌తండాకు చెందిన ధరావత్ స్వప్న(మమత), విజయవాడకు చెందిన సిద్ధి నాగార్జునరెడ్డి కొన్నేళ్ల క్రితం ప్రేమ పెళ్లి చేసుకున్నారు. వీరికి కూతురు అలేఖ్య జన్మించింది. నాగార్జునరెడ్డి మేస్త్రీ పనులు చేస్తూ కుటుంబాన్ని పోషించుకునేవాడు. కొంతకాలంగా దంపతుల మధ్య గొడవలు జరుగుతున్నాయి. మూడు నెలలుగా ఇద్దరు వేర్వేరుగా ఉంటున్నారు. ఈక్రమంలోనే నాగార్జునరెడ్డి మండల కేంద్రంలో ఉంటున్న తన భార్య వద్దకు వెళ్లి కూతురు అలేఖ్యను తనకు ఇవ్వమని గొడవకు దిగాడు. కూతురును లాక్కునే ప్రయత్నంలో ఇద్దరి మధ్య ఘర్షణ జరిగింది. దీంతో స్వప్న తన భర్తపై రాయితో దాడి చేసింది. నాగార్జునరెడ్డి తన కూతురును తనకు ఇవ్వాలని రోడ్డుపై కూర్చున్నాడు. గ్రామస్తులు జోక్యం చేసుకుని మంగళవారం మాట్లాడడానికి నిర్ణయించారు.

సింగారం సన్నాల బంగారం



ఇతను ఎల్లారెడ్డిపేట మండలం సింగారం గ్రామానికి చెందిన రైతు రాయిని అంజయ్య. ఇతనికి మూడున్నర ఎకరాలు భూమి ఉంది. మూడున్నర ఎకరాల్లో సన్నవడ్లు పండించాడు. దాదాపు 72 క్వింటాళ్ల వరకు దిగుబడి వచ్చింది. ఈ సీజన్‌లో అదనంగా బోనస్ డబ్బులు రూ.36వేలు అందనున్నాయి. ఎకరానికి దాదాపు రూ.25వేలు పెట్టుబడి పెట్టాడు. సన్నవడ్లు సాగుచేయడం సంతోషంగా ఉందంటున్నాడు. సన్నవడ్లతో దిగుబడి కూడా ఎక్కువగా వస్తుందంటున్నాడు.


తూకం వేసిన సన్నధాన్యం బస్తాలు

- ఊరంతా సన్నవడ్లు
- 736 ఎకరాలకు పైగా సాగు
- రూ.33.66లక్షలు బోనస్‌గా పొందనున్న రైతులు
- సన్నవడ్ల సాగుతో లాభాలబాట

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): వరిసాగు అంటేనే దొడ్డు రకం గుర్తుకొస్తుంది. సన్నరకం ధాన్యం మన దగ్గర సాగుచేసే వారు తక్కువ. రైతులు దశాబ్దాల కాలంగా దొడ్డు వడ్ల సాగుపైనే దృష్టి సారించేవారు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వ క్వింటాలుకు రూ.500 బోనస్ ప్రకటించడంతో చాలా మంది రైతులు సన్నాలు సాగుచేస్తున్నారు. ఒకరిద్దరు కాదు ఏకంగా ఎల్లారెడ్డిపేట మండలం సింగారం గ్రామంలోని రైతులు సన్నరకం వరి సాగుచేయగా.. కొనుగోళ్లు సైతం పూర్తయ్యాయి. సింగారం సన్నాల సాగుతో బంగారమైంది. సన్నాలు సాగుచేసిన సింగారం గ్రామ రైతుల సక్సెస్ స్టోరీ.

736 ఎకరాలకు పైగా..

రాజన్నసిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండలంలోని సింగారం గ్రామం మానేరువాగును ఆనుకొని ఉంటుంది. గ్రామస్తులు ఏటా దొడ్డురకం ధాన్యం మాత్రమే సాగు చేసేవారు. కానీ ఈ ఎండాకాలం సీజన్‌లోనే రైతులందరూ చర్చించుకుని సన్నరకం ధాన్యం సాగు చేశారు. గ్రామంలోని 422 మంది రైతులు తమకున్న 736 ఎకరాలకు పైగా విస్తీర్ణంలో సన్నరకం ధాన్యం పండించారు. ఎకరానికి సరాసరి 18 క్వింటాళ్ల వరకు దిగుబడి వస్తుందని రైతులు తెలిపారు. ఇప్పటి వరకు అధికారులు 6,733 క్వింటాళ్లు సేకరించి.. 5,954 క్వింటాళ్లు మిల్లులకు తరలించారు. అధికారుల లెక్కల ప్రకారం 6,733 క్వింటాళ్లపై ప్రభుత్వం ఇచ్చే బోనస్ డబ్బులు రూ.33,66,500 అదనంగా రైతులు సంపాదించారు. సింగారం గ్రామస్తులు సాగుచేసిన సన్నధాన్యం కాసుల వర్షం కురిపిస్తుంది.

ఖరీఫ్‌లో సింగారం బాటలో..

ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో జిల్లాలోని అనేక గ్రామాల రైతులు సన్నవడ్లు సాగు చేయడానికి సింగారం బాట పట్టారు. సింగారం గ్రామమంతా సన్నాలు సాగుచేసి ప్రభుత్వం ఇచ్చే బోనస్ డబ్బులతో లబ్ధి పొందనుండగా.. ఈ విషయం తెలుసుకున్న సమీప గ్రామాల రైతులు ఇక్కడికి వచ్చి సన్నాల సాగు, దిగుబడి గురించి తెలుసుకుంటున్నారు. సన్నాలను సాగుచేసి అధిక దిగుబడులు, బోనస్ రూపంలో వచ్చే డబ్బులతో ఆర్థికంగా ఎదగాలని వ్యవసాయ శాఖ అధికారులు రైతులకు అవగాహన కల్పిస్తున్నారు. మొత్తంగా జిల్లాలో ఈ సీజన్‌లో రైతులు ఎక్కువగా సన్నవడ్ల సాగునే ఎంచుకుంటున్నారు.

సమష్టి నిర్ణయంతో..



రబీ సీజన్‌లో గ్రామానికి చెందిన రైతులం సమష్టిగా నిర్ణయం తీసుకుని సన్నవడ్లు సాగు చేశాం. నాకున్న రెండు ఎకరాల్లో సన్నవడ్లు సాగు చేశాను. సన్నవడ్ల సాగుతో అధిక దిగుబడులే కాకుండా, బోనస్ రూపంలో వచ్చే డబ్బులు ఈ సీజన్‌లో పెట్టుబడులకు ఎంతో ఉపయోగపడతాయి. గ్రామ రైతులందరం సన్నవడ్లు పండించడంతో జిల్లాలోని అనేక గ్రామాల నుంచి రైతులు వచ్చి సన్నాల సాగు గురించి తెలుసుకుంటున్నారు.

– గనగోని మహేశ్, యువరైతు, సింగారం

అవగాహన కల్పిస్తున్నాం



మండలంలో అనేక గ్రామాల్లో ఈ సీజన్‌లో రైతులు సన్నవడ్లు సాగు చేస్తున్నారు. సన్నవడ్ల సాగుతో వచ్చే అదనపు ఆదాయంపై రైతులకు అవగాహన కల్పిస్తున్నాం. ఖరీఫ్ సీజన్‌లో రైతులు గతంలో కంటే రెట్టింపు స్థాయిలో సన్నవడ్ల విత్తనాలను కొనుగోలు చేశారు. ప్రభుత్వం ఇచ్చే రూ.500 బోనస్‌పైనే అందరి చూపు ఉంది. సింగారంలో రైతులంతా కలిసి సన్నవడ్లు పండించి ఇతర గ్రామాలకు ఆదర్శంగా నిలిచారు.

– పసుల శ్రీశైలం, వ్యవసాయ విస్తరణాధికారి, ఎల్లారెడ్డిపేట

ఆకట్టుకున్న హల్దీ వేడుకలు


పెళ్లి కూతురుకు దుస్తులు అందిస్తున్న ఐసీడీఎస్ బృందం


హల్దీ వేడుకల్లో ఆశ్రమ నిర్వాహకులు వీరేందర్-విమల దంపతులు

- ప్రారంభమైన మానస వివాహ వేడుకలు
- రేపు శుభముహూర్తం

రామగుండం: పట్టణంలోని తబితా ఆశ్రమంలో 16ఏళ్లుగా ఆశ్రయం పొందుతున్న నక్క మానస వివాహ వేడుకలు సోమవారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా జిల్లా అధికార యంత్రాంగం హల్దీ వేడుకలు ఘనంగా నిర్వహించింది. యువతి పెళ్లి పెద్దగా బాధ్యతలు స్వీకరించిన కలెక్టర్ కోయ శ్రీహర్ష.. ఈనెల 21వ తేదీన కలెక్టరేట్‌లోని ఆలయంలో వివాహం జరిపించేందుకు నిర్ణయించారు. తొలిరోజు వేడుకల కోసం సింగరేణి ఆర్జీ–1 జీఎం సతీమణి అనిత, ఆర్తి స్వచ్ఛంద సంస్థ అధ్యక్షురాలు భీమనాథి విజయ పుస్తె, మట్టెలు, చీర, సారె, అంతర్గాం అబ్దుల్ కలాం చారిటబుల్ ట్రస్ట్ నిర్వాహకులు రూ.ఐదు వేల నగదు, ఎన్టీపీసీ శ్రీసీతారామ సేవాసమితి నిర్వాహకులు గోలివాడ చంద్రకళ, కంది సుజాత, బిల్లా శ్రీదేవి, కొండు రమాదేవి పెళ్లి బట్టలను పెళ్లి కూతురుకు అందజేశారు. ఫైట్‌ఫర్ బెటర్ సొసైటీ నిర్వాహకుడు మద్దెల దినేశ్, లెనిన్ జయహో సంస్థ ప్రతినిధి చెక్కెన శ్రీలత పెళ్లి కుమార్తెను తయారు చేశారు. జిల్లా సంక్షేమాధికారి వేణుగోపాల్‌రావు, అంతర్గాం తహసీల్దార్ రవీందర్‌పటేల్ తదితరులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.

వైర్లు కట్‌చేసి.. సెన్సార్లు తొలగించి..



ఆందోళనకారులు తొలగించిన సెన్సార్ల వైర్లు, మాట్లాడుతున్న ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్

- బసంత్‌నగర్ టోల్‌ప్లాజాలో వాహనాలకు ఉచిత ప్రయాణం
- రామగుండం, స్థానిక లారీ యజమానుల ఆందోళన
- హెచ్‌కేఆర్ టోల్‌ప్లాజా అధికారుల తీరుపై ఎమ్మెల్యే ఠాకూర్ ఆగ్రహం


రుసుం లేకుండా వెళ్తున్న ఆర్టీసీ బస్సు

పాలకుర్తి(రామగుండం): పాలకుర్తి మండలం బసంత్‌నగర్ సమీపంలోని రాజీవ్‌రహదారిపై గల కన్నాల టోల్‌ప్లాజావద్ద రామగుండం ఏరియా, స్థానిక లారీ యజమానులు సోమవారం రాత్రి ఆందోళనకు దిగారు. గోదావరిఖని ఏరియా లారీలకు టోల్‌రుసుం వసూలు చేయకుండా ఉచిత ప్రయాణానికి అనుమతించాలని డిమాండ్ చేశారు. ఇదే సమయంలో గోదావరిఖని వైపు వెళ్తున్న రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ ఆందోళనకారుల వద్దకు వెళ్లి సంఘీభావం ప్రకటించారు. ఫోర్‌లేన్ నిర్వహణ సంస్థ హెచ్‌కేఆర్‌కు టోల్‌వసూళ్లపై ఉన్న శ్రద్ధ ప్రజా భద్రత, రోడ్ల నిర్వహణపై లేదన్నారు. పన్నెండేళ్లుగా టోల్ ద్వారా అధిక ఆదాయం ఆర్జిస్తున్న సంస్థ.. సర్వీసు రోడ్ల నిర్మాణంలో తీవ్ర నిర్లక్ష్యం చేస్తోందని ధ్వజమెత్తారు. తద్వారా అనేక ప్రమాదాల్లో వాహనదారులు ప్రాణాలకు కోల్పోయారని తెలిపారు. స్థానిక ప్లాజాలోని కార్మికులకు పన్నెండేళ్లుగా వేతనం పెంచడం లేదన్నారు. కనీస వేతన చట్టం అమలు చేయడం లేదని మండిపడ్డారు. గోదావరిఖని ఏరియా లారీలకు టోల్ మాఫీ చేయాలని కోరారు. ప్లాజా వద్ద మరుగుదొడ్లు, విశ్రాంతిగది వంటి కనీస సౌకర్యాలు కల్పించకపోవడం శోచనీయమన్నారు. ఈనేపథ్యంలోనే ఆందోళనకారులు తమ డిమాండ్లు నెరవేర్చేదాకా టోల్ వసూళ్లు నిలిపివేయాలన్నారు. క్యాబిన్‌లో విధులు నిర్వర్తిస్తున్న కార్మికులను బయటకు వెళ్లగొట్టారు. టోల్‌గేట్లు తెరిచి ఉంచారు. ఆటోమేటిక్ సెన్సార్ల వైర్లను కట్ చేశారు. ఉచితంగా వాహనాల రాకపోకలకు వీలుగా చర్యలు తీసుకున్నారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా నాయకులు, లారీ యజమానులు టోల్‌ప్లాజాపై ఇలాంటి చర్యలకు పాల్పడడం ఇదే తొలిసారి కావడం గమనార్హం.

విద్యుదాఘాతంతో రైతు దుర్మరణం


రాజేందర్‌రెడ్డి (ఫైల్)

పెగడపల్లి: విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వద్ద తీగల కింద ఉన్న చెట్లను తొలగిస్తున్న క్రమంలో విద్యుత్ షాక్ తగిలి రైతు మృతి చెందిన ఘటన మండలంలోని నంచర్లలో సోమవారం చోటు చేసుకుంది. గ్రామస్తులు, కుటుంబసభ్యుల కథనం ప్రకారం.. గ్రామ సమీపంలోని వ్యవసాయ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వద్ద విద్యుత్ సిబ్బంది, రైతులతో కలిసి ఎడ్ల రాజేందర్‌రెడ్డి (43) చెట్లను తొలగించే పనులు చేపడుతున్నాడు. అప్పటికే ట్రాన్స్‌ఫార్మర్‌కు కరెంటు సరఫరా నిలిపివేశారు. అయితే ట్రాన్స్‌ఫార్మర్ పైభాగాన ఉన్న చెట్టు తీగను తొలగించేందుకు రాజేందర్‌రెడ్డి పైకి ఎక్కాడు. ఈ క్రమంలో 11కేవీ విద్యుత్ తీగ తగలడంతో తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే స్థానికులు 108వాహనంలో జగిత్యాల ఆసుపత్రికి తరలించారు. వైద్యులు ప్రయత్నించినా ఫలితం కనిపించలేదు. చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఇంటి వద్ద ఉన్న తన భర్తను గ్రామానికి చెందిన కోల రాములు అనే వ్యక్తి బలవంతంగా తీసుకెళ్లాడని, విద్యుత్ సిబ్బంది ట్రాన్స్‌ఫార్మర్‌కు విద్యుత్ సరఫరా నిలిపి వేయకుండానే పనులు చేయడంతో తన భర్త ప్రాణాలు కోల్పోయాడని మృతుడి భార్య విజయ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని ట్రైనీ ఎస్సై రవీందర్‌కుమార్ తెలిపారు. ట్రాన్స్‌కో ఏడీఈ వరుణ్ కుమార్, ఏఈ మధు సంఘటనా స్థలాన్ని సందర్శించి ప్రమాదం జరిగిన తీరును తెలుసుకున్నారు. మృతుని కుటుంబాన్ని ప్రభుత్వపరంగా ఆదుకుంటామని ఏడీఈ తెలిపారు.

వ్యాయామ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి


కరీంనగర్ జిల్లా పూర్తిస్థాయి కార్యవర్గం

కరీంనగర్‌స్పోర్ట్స్: వ్యాయామ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి సంఘటితంగా కృషి చేస్తామని జిల్లా పెటా టీఎస్ అధ్యక్షుడు బాబు శ్రీనివాస్ పేర్కొన్నారు. కరీంనగర్ జిల్లా కేంద్రంలో సోమవారం నిర్వహించిన జిల్లా పెటా టీఎస్ సర్వసభ్య సమావేశంలో మాట్లాడారు. నూతనంగా ఏర్పడ్డ కమిటీ సభ్యులు ఎల్లవేళలా సంఘం పటిష్టతకు కృషి చేయాలని సూచించారు. పెటా టీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆడెపు శ్రీనివాస్ మాట్లాడుతూ సభ్యుల సలహాలు, సూచనలతో ముందుకు సాగుతామన్నారు. అనంతరం పెట టీఎస్ కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

జిల్లా వ్యాయామ ఉపాధ్యాయ సంఘం

పెటా టీఎస్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బాబు శ్రీనివాస్, ఆడెపు శ్రీనివాస్, అసోసియేట్ అధ్యక్షులుగా దత్తాత్రి, హరికిషన్, వి.రూపారాణి, పి.శ్రీనివాస్, ఎస్.శ్యామలాదేవి, కె.రమాదేవి, పి.శ్రీనివాస్ జి.నిర్మల ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా ఎస్.రమేశ్‌కుమార్, వి.శ్రీలత, ఎం.చంద్రశేఖర్, వి.సూర్యప్రకాశ్, యజాజ్ అహ్మద్, బిత్ర శ్రీనివాస్, ఎం.రమేశ్, కె.వెంకటలక్ష్మి ఎన్నికయ్యారు. సంఘం కోశాధికారిగా డి.వీర్‌పాల్, సంయుక్త కార్యదర్శులుగా రామానందతీర్థ, బి.సత్యనారాయణ, స్నేహలత, ప్రవీణ, రాజ్‌కుమార్, సత్యానంద్, ప్రతిమ ఎన్నికయ్యారు.

హనుమాన్ పెద్ద జయంతి ఉత్సవాలకు అంకురార్పణ


యాగశాల శుద్ధి పూజలో పాల్గొన్న ఆలయ అర్చకులు

మల్యాల: హనుమాన్ పెద్ద జయంతి ఉత్సవాలకు సోమవారం సాయంత్రం అంకురార్పణ నిర్వహించారు. ఆలయ ప్రధాన ద్వారం, వైజంక్షన్ వద్దగల స్వాగత తోరణం, ఆలయ పరిసరాలను రంగురంగుల విద్యుద్దీపాలతో అలంకరించారు. స్వామివారి ఉత్సవమూర్తిని దీక్ష విరమణ మంటపానికి తీసుకెళ్లి పూజలు నిర్వహించారు. అనంతరం యాగశాల శుద్ధి పుణ్యాహవచనం, అంకురార్పణ, అఖండ దీపస్థాపన చేపట్టారు. కార్యక్రమంలో ఆలయ స్థానాచార్యులు కపీందర్, ప్రధాన అర్చకులు జితేంద్ర స్వామి, రామకృష్ణ, ఉప ప్రధాన అర్చకులు చిరంజీవి, ఆలయ ఈఓ శ్రీకాంత్‌రావు, సూపరింటెండెంట్లు చంద్రశేఖర్, సునీల్‌కుమార్, హరిహరనాథ్ తదితరులు పాల్గొన్నారు.

2డే క్రికెట్ లీగ్ టోర్నీకి వేళాయే..

- 21 నుంచి జూన్ 5 వరకు లీగ్ మ్యాచ్‌లు
- వేములవాడ, కరీంనగర్ కేంద్రంగా పోటీలు



వివరాలు వెల్లడిస్తున్న క్రికెట్ సంఘం అధ్యక్షుడు ఆగంరావు

కరీంనగర్‌స్పోర్ట్స్: కరీంనగర్ జిల్లా క్రికెట్ సంఘం ఆధ్వర్యంలో 2డే క్రికెట్ లీగ్ టోర్నీ ప్రారంభం కానుంది. హైదరాబాద్ క్రికెట్ సంఘం (హెచ్‌సీఏ) రాష్ట్రస్థాయి టోర్నీల కోసం ముందస్తుగా ఉమ్మడి జిల్లా క్రికెట్ పోటీల నిర్వహణకు శ్రీకారం చుట్టింది. ఈనేపథ్యంలో కరీంనగర్ జిల్లా క్రికెట్ సంఘం ఆధ్వర్యంలో అండర్– 25 విభాగంలో 2డే క్రికెట్ టోర్నీ పోటీలు నిర్వహించేందుకు సిద్ధమైంది. ఇప్పటికే ఉమ్మడి జిల్లాలలోని 9 నియోజకవర్గాల నుంచి 6 జట్లను ఎంపిక చేయగా, ఈ నెల 21 నుంచి జూన్ 6 వరకు మ్యాచ్‌లు నిర్వహించనున్నారు. మ్యాచ్‌ల వివరాలను జిల్లా క్రికెట్ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు వి.ఆగంరావు, ఎస్.మురళీధర్ రావు, ఉపాధ్యక్షుడు కె.మహేందర్‌గౌడ్ వెల్లడించారు. ఈ పోటీల్లో రాణించినవారిని అండర్– 25 ఉమ్మడి కరీంనగర్ జట్టుకు ఎంపిక చేయనున్నారు. జూన్‌లో హెచ్‌సీఏ ఆధ్వర్యంలో జరిగే ఇంటర్ డిస్ట్రిక్ టోర్నమెంట్‌లో కరీంనగర్ అండర్– 25 జట్టు పాల్గొననుంది.

6 జట్లు..16 మ్యాచ్‌లు..

ఉమ్మడి కరీంనగర్‌లోని 13 నియోజకవర్గాల నుంచి 6 జట్లను ఎంపిక చేశారు. 3 వేదికల్లో 16 మ్యాచ్‌లు నిర్వహిస్తారు. కరీంనగర్‌లోని శాతవాహన యూనివర్సిటీ, సెయింట్ అల్ఫోన్స్ పాఠశాల, వేములవాడలోని డాక్టర్ నర్సింగరావు మైదానాల్లో పోటీలు జరుగుతాయి. ఫైనల్ మ్యాచ్‌లు జూన్ 5, 6 తేదీల్లో శాతవాహనలో జరుగనున్నాయి.

మ్యాచ్‌లు ఇవే..

- 21, 22న సిరిసిల్ల, వేములవాడ వర్సెస్ పెద్దపల్లి, మంథని, రామగుండం – శాతవాహన యూనివర్సిటీ.
- 21, 22న జగిత్యాల, కోరుట్ల, ధర్మపురి వర్సెస్ మానకొండూర్, హుస్నాబాద్, హుజురాబాద్ – సెయింట్ అల్ఫోన్స్ స్కూల్.
- 21, 22న కరీంనగర్ రూరల్, చొప్పదండి వర్సెస్ కరీంనగర్ టౌన్ – వేములవాడ.
- 24, 25న మానకొండూర్, హుస్నాబాద్, హుజురాబాద్ వర్సెస్ సిరిసిల్ల, వేములవాడ – వేములవాడ.
- 24, 25న కరీంనగర్‌టౌన్ వర్సెస్ పెద్దపల్లి, మంథని, రామగుండం– సెయింట్ అల్ఫోన్స్.
- 24, 25న కరీంనగర్ రూరల్, చొప్పదండి వర్సెస్ జగిత్యాల, కోరుట్ల, ధర్మపురి – శాతవాహన యూనివర్సిటీ.
- 27, 28న సిరిసిల్ల, వేములవాడ వర్సెస్ కరీంనగర్ టౌన్ – వేములవాడ.
- 27, 28న మానకొండూర్, హుస్నాబాద్, హుజురాబాద్ వర్సెస్ కరీంనగర్ రూరల్, చొప్పదండి – సెయింట్ అల్ఫోన్స్.
- 27, 28న పెద్దపల్లి, మంథని, రామగుండం వర్సెస్ జగిత్యాల, కోరుట్ల, ధర్మపురి – శాతవాహన యూనివర్సిటీ.
- 30, 31న కరీంనగర్ రూరల్, చొప్పదండి వర్సెస్ సిరిసిల్ల, వేములవాడ – వేములవాడ.
- 30, 31న జగిత్యాల, కోరుట్ల, ధర్మపురి వర్సెస్ కరీంనగర్‌టౌన్ – శాతవాహన యూనివర్సిటీ.
- 30, 31న పెద్దపల్లి, మంథని, రామగుండం వర్సెస్ మానకొండూర్, హుస్నాబాద్, హుజురాబాద్– సెయింట్ అల్ఫోన్స్.
- జూన్ 2, 3న సిరిసిల్ల, వేములవాడ వర్సెస్ జగిత్యాల, కోరుట్ల, ధర్మపురి – వేములవాడ.
- 2, 3న పెద్దపల్లి, మంథని, రామగుండం వర్సెస్ కరీంనగర్ రూరల్, చొప్పదండి – సెయింట్ అల్ఫోన్స్.
- 2, 3న కరీంనగర్ టౌన్ వర్సెస్ మానకొండూర్, హుస్నాబాద్, హుజురాబాద్ – శాతవాహన యూనివర్సిటీ.
- 5, 6న ఫైనల్.. లీగ్‌లో ఎక్కువ స్కోర్ చేసిన రెండు జట్లు – శాతవాహన యూనివర్సిటీ.

పాముకాటుతో నాలుగేళ్ల చిన్నారి మృతి

● అంత్యక్రియలకు వచ్చి అనంతలోకాలకు


స్నేహాన్సి మృతదేహం

తంగళ్లపల్లి(సిరిసిల్ల): మండలంలోని చిన్నలింగాపూర్‌లో పాముకాటుతో నాలుగేళ్ల చిన్నారి మృతిచెందింది. కామారెడ్డి జిల్లాకు చెందిన వలిదాసు కృష్ణయ్య–లలిత దంపతులకు ఇద్దరు కూతుళ్లు స్నేహాన్సి(4), శ్రీజ(2). తంగళ్లపల్లి మండలం చిన్నలింగాపూర్‌లో బంధువు సంవత్సరీకం ఉండగా, మరో బంధువు సోమవారం మృతిచెందారు. ఈ రెండు కార్యక్రమాలకు హాజరయ్యేందుకు లలిత తన ఇద్దరు పిల్లలతో చిన్నలింగాపూర్‌లోని తల్లిగారింటికి వచ్చింది. సోమవారం రాత్రి 9 గంటల ప్రాంతంలో పెద్ద కూతురు స్నేహాన్సి ఆడుకుంటూ ఇంటి బయటకు వెళ్లగా పాముకరిచింది. పాపను గమనించే సరికి అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయింది. సిరిసిల్ల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా అప్పటికే చనిపోయిందని వైద్యులు తెలిపారు. పోలీసులు వివరాలు సేకరించి దర్యాప్తు చేస్తున్నారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

మానకొండూర్: మండలంలోని పచ్చునూర్ గ్రామ శివారులో సోమవారం అనుమానాస్పదంగా కుళ్లిపోయిన మృతదేహం లభ్యమైంది. పోలీసులు తెలిపిన వివరాలు.. ఆంజనేయులు(50) అనే వ్యక్తి కొద్ది నెలల నుంచి గ్రామానికి చెందిన బత్తుల అజయ్ మేస్త్రీ వద్ద కూలీ పనిచేస్తున్నాడు. సోమవారం గ్రామ శివారులోని ఓ వ్యక్తికి చెందిన పొలం సమీపంలో మృతదేహం కుళ్లి పోయిందని గ్రామ కారోబార్‌కు తెలుపగా పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలాన్ని సీఐ సంజీవ్ పరిశీలించారు. మృతుకి గల కారణాలు తెలియనందున అనుమానాస్పదంగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

● మరో ఇద్దరికి గాయాలు


దిలీప్ (ఫైల్)

సిరిసిల్లక్రైం/ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): గంభీరావుపేట మండలంలోని బంధువుల వివాహ వేడుకకు హాజరై తిరిగి వెళ్తుండగా జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు ప్రాణాలు కోల్పోయాడు. మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. బంధువులు తెలిపిన వివరాలు. తంగళ్లపల్లి మండలం కస్బెకట్కూరుకు చెందిన శనిగరపు దిలీప్(28) గజసింగవరంలోని తన బంధువుల వివాహ రిసెప్షన్‌కు ఆదివారం హాజరయ్యాడు. రాత్రి కావడంతో ఎల్లారెడ్డిపేటలోని బంధువుల ఇంట్లో నిద్రించాడు. సోమవారం తెల్లవారుజామున వేములవాడకు వెళ్తుండగా బైపాస్‌రోడ్డులోని మెడికల్ కాలేజీ వద్ద కల్వర్టులోకి బైక్ దూసుకెళ్లింది. దిలీప్ అక్కడికక్కడే మృతిచెందగా.. బైక్‌పై ఉన్న మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. వీరిని ఆస్పత్రికి తరలించారు. ఒక్కగానొక్క కొడుకు దిలీప్ చనిపోవడంతో తల్లిదండ్రులు చంద్రయ్య, లక్ష్మి రోదనలు మిన్నంటాయి. దిలీప్ ఓ ప్రైవేట్ మైక్రోఫైనాన్స్‌లో ఉద్యోగం చేస్తుండేవాడని తెలిసింది.

తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ

కోరుట్ల రూరల్: మండలంలోని మోహన్‌రావుపేటలో ఆదివారం రాత్రి దొంగలు తాళం వేసి ఉన్న ఇల్లులో దొంగతనానికి పాల్పడ్డారు. గ్రామానికి చెందిన సింగు సురేశ్ రెండురోజుల క్రితం తన ఇంటికి తాళం వేసి కుటుంబంతో కలిసి బంధువుల ఇంటికి వెళ్లాడు. సోమవారం ఉదయం తాళం పగులగొట్టి ఉండడాన్ని గమనించిన ఇరుగు పొరుగు వారు సురేశ్‌కు ఫోన్‌ద్వారా సమాచారం ఇచ్చారు. ఇంటికి చేరిన సురేష్ బీరువాలో దాచిపెట్టిన నాలుగు తులాల బంగారం, 15 తులాల వెండి పట్టగొలుసులు, రూ.8వేల నగదు ఎత్తుకెళ్లినట్టు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు పేర్కొన్నారు.